

# డిమాండ్లపై స్పష్టత ఉండాలి

## పరిష్కరించగల సమస్యలకు ప్రాధాన్యం ☛ 'ఆయుధం'పై హేతుబద్ధత: బాలగోపాల్

**విప్లవ పార్టీలతో ప్రభుత్వం చర్చలు రెండో అంకంలోకి చేరనున్నాయి. తొలిదశ చర్చలు సాగిన తీరును విశ్లేషిస్తూ... రెండో దశ చర్చలు ఎలా ఉంటే బాగుంటుందన్న అంశాలపై డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, డాక్టర్ బాలగోపాల్‌లతో 'న్యూస్‌టుడే' ప్రత్యేక ఇంటర్వ్యూలు.**

**తొలివిడత శాంతి చర్చల సరళిపై మీ అభిప్రాయం?**

తొలి విడత చర్చల్లో ఒక్క భూ సమస్య మాత్రమే నిర్దిష్టంగా చర్చకు వచ్చింది. మిగతా వాటిపై కూడా నిర్దిష్ట చర్చ జరిగితే బాగుండేది. చర్చల సమయంలో మావోయిస్టుల ఎజెండా సాధారణంగా ఉంది. రాష్ట్రంలోని అన్ని సమస్యలనూ ప్రస్తావించారు. కానీ... వాటిని నిర్దిష్టంగా లేవనెత్త లేదు. చర్చలు మంచి వాతావరణంలోనే జరిగాయి.

**రెండో విడత చర్చలు ఏరీతిగా జరగాలని భావిస్తున్నారు?**

చర్చల జరుగుతున్న తీరు బాగుంది. అయితే... ఎజెండాను కుదించుకోవాలి. పరిష్కరించగల సమస్యలను ముందు లేవనెత్తాలి. అప్రస్తుతమైన అంశాలతో కాలక్షేపం చేయకూడదు. నిర్దిష్టత లేకుండా మళ్లీ మళ్లీ చర్చలకు కూర్చున్నా... సరైన ఫలితాలు రావు.

**తొలి విడతలో ఇరుపక్షాల పరంగా దొర్లిన తప్పులేమైనా ఉన్నాయంటారా? మలి విడత చర్చల సందర్భంగా రెండు పక్షాలకూ మీరిచ్చే సలహా ఏమిటి?**

చర్చల సందర్భంగా దొర్లిన తప్పులేమీ ఇరుపక్షాల్లోనూ లేవు. కానీ చర్చలు ముగిశాక మాత్రం తప్పులు దొర్లుతున్నాయి. రెండో విడత చర్చలకు సానుకూల వాతావరణం ఉన్న సమయంలో ఇలా జరగడం బాధాకరం. ఆయుధాలు పూర్తి స్థాయిలో వీడితేనే చర్చలన్న ధ్వని నేడు ప్రభుత్వం వైపు నుంచి వినిపిస్తోంది. డీజీపీయే కాకుండా ముఖ్యమంత్రి కూడా ఇవే ప్రకటనలు చేస్తున్నారు. గతంలో... ఆయుధాలపై తెదేపా గట్టిగా పట్టుబట్టినందునే... వారి హయాంలో చర్చలు జరగలేదన్న అభిప్రాయం అందరిలోనూ ఉంది. ప్రభుత్వమూ దీన్ని ఒప్పుకుంది. దాంతో ఆయుధాలను పూర్తిగా త్యజించాలన్న వాదనను పక్కన పెడదామనుకున్నారు. అందుకే చర్చలు మొదలయ్యాయి. నిజానికి కాల్పుల విరమణ సమయంలో... నక్సలైట్లు ప్రచారం చేసుకొనేటప్పుడు ఆయుధాలతో సంచరించకూడదు అన్నంత వరకే ఈ ఒప్పందం. దానిపై ప్రభుత్వం అడగటం సరైందే. కానీ ఇప్పుడు ప్రభుత్వం ఒక్కసారిగా ఆయుధాలు పూర్తిగా వదిలి వస్తేనే చర్చలుంటాయన్న మాదిరిగా సంకేతాలిస్తోంది. ఇది ప్రమాదకర పరిణామం. నక్సల్స్ కూడా ఆయుధాలను తాము పూర్తిగా ఎందుకు విడనాడలేకపోతున్నారో హేతుబద్ధంగా చెప్పుకోలేకపోతున్నారు. 'మాకు ప్రాణాపాయం ఉంది. అందుకే ఆయుధాలను పూర్తిగా విడనాడలేకపోతున్నాం. ప్రభుత్వం మాకు సరైన పద్ధతిలో రక్షణ కల్పిస్తే...' అని వారు తమ వాదనను పటిష్ఠంగా వినిపించడంలేదు. అది ఏదో ఓ సైద్ధాంతిక విషయంగా మాట్లాడుతున్నారు. పోలీసులు ఆయుధాలతో తిరగడం లేదా? అనడం సరైంది కాదు.

**రెండో విడత చర్చలు ఫలవంతమయ్యే దిశగా వెళ్లాలంటే ఎలాంటి పట్టువిడుపులు అవసరం?**

ఒకటి... మొత్తంగా మావోయిస్టులు తుపాకులు వదలాలన్న వైఖర్ని ప్రభుత్వం విడనాడాలి. ఏడో క్లాజ్ విషయంలో మావోయిస్టులూ మొండిగా వ్యవహరించకూడదు. రెండు... చర్చలను పాడు చేసుకొనే ప్రకటనలనూ ఇద్దరూ విడనాడాలి. మూడు... ఈ సారి నిర్దిష్టమైన ఎజెండాతో చర్చలు కొనసాగాలి. ఆ బాధ్యత ముఖ్యంగా మావోయిస్టులపై ఉంది. భూ పంపిణీ, ప్రత్యేక తెలంగాణ, దళితుల సమస్యలు వంటి మావోయిస్టుల డిమాండ్లలో స్పష్టత అవసరం.

**నక్సలైట్లు-పోలీసులు పరస్పర నిందాపూర్వకంగా చేసుకుంటున్న విమర్శలు చర్చల ప్రక్రియపై ఏమైనా ప్రభావం చూపుతాయని అనుకుంటున్నారా?**

తప్పకుండా ప్రభావితం చేస్తాయి. పోలీసులే కాదు. ముఖ్యమంత్రి కూడా అలానే మాట్లాడుతున్నారు. మావోయిస్టులకు కూడా అనవసర వ్యాఖ్యలు తగవు. ఎవరి అభిప్రాయాలు వారివి...ఎవరి విధానాలు వారివి. అంటే... మావోయిస్టుల పంథాను రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ఆ పార్టీలను మావోయిస్టులూ విశ్వసించడం లేదు. కానీ... వీటన్నింటినీ పక్కన పెట్టి మాట్లాడుకుందామని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అలాంటప్పుడు ఇంకా వాటిపైనే వ్యాఖ్యలు ఎందుకు? పరస్పర వాగ్బాణాలెందుకు?

**ఆయుధం అన్న అంశానికి చర్చల్లో ఏ మేరకు ప్రాధాన్యం ఉంటుంది? ఇది చర్చలను ఏ మేరకు ప్రభావితం చేస్తుంది?**

ఆయుధమన్నది చర్చల్లో భాగం కావల్సింది కాదు. అది కాల్పుల విరమణ ఒప్పందంలో భాగం మాత్రమే. పేదల సమస్యలు, భూపంపిణీ చర్చలకు ఎజెండా. ఆయుధం ఎంత మాత్రం కాదు. చర్చల ప్రక్రియకు ముందు ఈ అంశం చర్చకొచ్చింది. అదీ చాలా పరిమిత స్థాయిలో. ఈ సమస్యను అక్కడే పరిష్కరించుకోవాల్సింది. ఇప్పుడు దాన్ని చాలాముందుకు తీసుకెళ్లారు. తుపాకులు వదలడమంటే విప్లవాన్ని వదలమనడమేనని మావోయిస్టులు, రాజ్యాంగం ఉండగా తుపాకులను ఎలా ధరిస్తారని ప్రభుత్వం పరస్పర విమర్శలు చేసుకొనే స్థాయికి నేడీ అంశం చేరుకుంది. ఏడో క్లాజ్‌పై మావోయిస్టులు తమ మొండితనాన్ని వదలాలి. కాల్పుల విరమణ పూర్తి స్థాయిలో ఖరారు కావాలి. అక్కడితో ఆయుధంపై చర్చ ఆగాలి.

**భూ పంపిణీపై దృష్టి సారిస్తామని ప్రభుత్వం నిర్దిష్ట హామీ ఇచ్చాక... భూముల్లో నక్సల్స్ ఎర్రజెండాలను పాతడంలోని ఔచిత్యమేమిటి?**

ఇది కూడా చిన్న విషయాన్ని భూతద్దంలో చూడటమే. ప్రభుత్వ లెక్కల ప్రకారమే... రిజర్వ్ అటవీ ప్రాంతంలో, నాలుగు లక్షల ఎకరాలపై బడిన భూమి ఆదివాసీల చేతుల్లో ఉంది. మావోయిస్టుల మద్దతుతో వారు దాన్ని సాగు చేసుకుంటున్నారు. నేడు జెండాలు పాతుతున్న 200 ఎకరాలు పెద్ద విషయం కాదు. భూపంపిణీపై ప్రభుత్వం హామీ ఇచ్చింది సరే... ఆ దిశగా కమిషన్‌ను ఇంకా ఏర్పాటు చేయలేదుగా! దానిని ఏర్పాటు చేయాలి. పనినీ ప్రారంభించాలి.

**చర్చల ప్రక్రియపై ప్రభుత్వానికి కాని, నక్సలైట్లకు కాని చిత్తశుద్ధి లేదని, ఇరువర్గాలూ తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ ప్రక్రియను వినియోగించుకుంటున్నాయని వస్తున్న విమర్శలపై...?**

ఆ వాదన సరైంది కాదు. ఎందుకంటే... ఇరు పక్షాలూ కూడా తమ తమ అవసరాల రీత్యా మాత్రమే చర్చలకు సిద్ధమయ్యాయన్నది నా అభిప్రాయం. మరెవరి బాగు కోసమో వాళ్లు చర్చలకు కూర్చో లేదు. అందువల్ల చిత్తశుద్ధి లోపించే సమస్యే లేదు. గత మూడు దశాబ్దాలుగా ఇద్దరూ అనుసరిస్తున్న వ్యూహ- ప్రతివ్యూహాలు నేడు సంక్షోభంలో పడ్డాయి. ఇద్దరూ తమ లక్ష్యానికి చేరువ కాలేకపోయారు. మావోయిస్టులు విప్లవాన్ని సాధించలేదు. వార్ని ప్రభుత్వం తుడిచిపెట్టలేకపోయింది. కానీ ప్రాణాలు మాత్రం వందల సంఖ్యలో పోతున్నాయి. ఇది అర్థంచేసుకొనే ఇరువర్గాలూ చర్చలకు వచ్చాయి. అలాంటప్పుడు చిత్తశుద్ధి లేకపోవడమన్న ప్రశ్న ఎలా తలెత్తుతుంది? అందుకు ఆస్కారం లేదు.

ఈనాడు